క్లుప్తంగా

క్యాన్సర్ బాధితునికి చేయూత



శ్రీనుకు నగదు అందిస్తున్న రామ అప్పారావు మిత్ర బృందం

అగనంపూడి: క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగికి వైద్య ఖర్చుల నిమిత్తం సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు, మిత్ర బృందం కలిపి రూ.15వేల నగదును అందించారు. అగనంపూడి నిర్వాసితకాలనీ పినమదకకు చెందిన శ్రీను ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. శ్రీనుకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కొద్ది రోజులుగా శ్రీను క్యాన్సర్‌తో బాధ పడటంతో ఇల్లు గడవడం, పిల్లల చదువులు భారమయ్యాయి. విషయం తెలిసిన రామ అప్పారావు మిత్రుల సహాయంతో రూ.15వేల నగదును శ్రీను కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో పట్టా రామ అప్పారావు, గుదే సుశీలా గజేంద్రరావు, కె.హనుమంతురావు, ఎం.మస్తాన్‌రెడ్డి, బొండా ఈశ్వరరావు, ఉమామహేశ్వరరావు, గుదే గజేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బట్టు సన్యాసిరావు జయంతి



బట్టు సన్యాసిరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ సూర్యకుమారి

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ 77వ వార్డు మాజీ అధ్యక్షుడు బట్టు సన్యాసిరావు 59వ జయంతిని పిట్టవానిపాలెంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సన్యాసిరావు భార్య, 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారులకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

భక్తులకు చీరల పంపిణీ



భక్తులకు చీరలు పంపిణీ చేస్తున్న కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణితి గ్రామదేవత కొత్తమ్మ తల్లి జాతర ఉత్సవాల్లో మారువారం సందర్భంగా భక్తులకు మంగళవారం చీరలు పంపిణీ చేశారు. జాతర సందర్భంగా భక్తులు అమ్మవారికి కానుకగా సమర్పించిన చీరలను ఆలయం వద్ద పూజలు చేసి, భక్తులకు అందజేశారు. ముందుగా అమ్మవారికి విశేష పూజలు, ఉపహారాలు నిర్వహించారు. పండగ సందర్భంగా భక్తులు సమర్పించిన 5 వందల చీరలను పేద మహిళలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు విజయరామరాజు, ప్రగడ వేణుబాబు, సూరిశెట్టి పెంటారావు, ప్రగడ శ్రీను, చిత్రాడ సన్యాసిరావు, బొడ్డ గోవింద్, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, అతికంశెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి స్వర్ణ పుష్పార్చన



పూజలో పాల్గొన్న ఉభయదాతలు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం..అప్రమత్తత అవసరం

- దోమలతో పొంచి ఉన్న ముప్పు
- వాతావరణ మార్పులతో విషజ్వరాల వ్యాప్తి
- జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యం పదిలం



76వ వార్డు రామచంద్ర నగర్‌లో రుబ్బురోలులో నిల్వనీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది



64వ వార్డు గంగవరంలో డ్రమ్‌లో ఉన్న నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది



73వ వార్డు కొత్త కర్ణవానిపాలెంలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెదగంట్యాడ: వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు, అడపాదడపా కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. వర్షాలకు డ్రైనేజీల్లో నీరు చేరి, దోమలు వృద్ధి చెందడంతో డెంగ్యూ, మలేరియా, అతిసారం వ్యాప్తి చెందే అవకాశం ఉండటంతో వైద్య, ఆరోగ్య సిబ్బంది వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జ్వరాల కారణంగా ఆస్పత్రులకు వస్తున్నవారి సంఖ్య ఎక్కువగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేస్తున్నారు.

సురక్షిత తాగునీరు

జలమే జీవనాధారం. కలుషితమైతే అదే ప్రాణాంతకం. వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో తాగునీరు కలుషితం అయ్యే అవకాశం ఉన్నందున కాచి చల్లార్చిన నీరు తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే ఆహారాన్ని కూడా వేడిగా ఉన్నప్పుడే తీసుకోవాలని తెలియజేస్తున్నారు. పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడిగిన తర్వాతే తినాలని సూచిస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత

ఇంటి పరిసరాల్లో చెత్త చేరినా, నీరు నిలిచినా దోమలు పెరిగి విషజ్వరాలు వచ్చే అవకాశం ఉంది. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ తదితర జ్వరాల వ్యాప్తిని కట్టడికి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. నిల్వ నీటిలో దోమలు ఉత్పత్తి అవుతాయి గనుక వారానికోసారైనా వాటిని తొలగించి, శుభ్రం చేసుకుని కొత్త నీరు పట్టుకోవాలని తెలియజేస్తున్నారు. వారానికో రోజు డ్రై పాటించాలని సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రెండు రోజుల కంటే జ్వరం తగ్గక పోతే స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించాలి. అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి. సాధ్యమైనంత వరకు నీటిని కాచి తాగాలి. దోమలు కుట్టాక చికిత్స చేయించుకోవడం కంటే అవి కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం. చిన్న చిన్న జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవచ్చు.

–డాక్టర్ రమేష్‌బాబు,
పెదగంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి

విద్యార్థుల సేవా నిరతి

విభిన్న ప్రతిభావంతుల పాఠశాలకు రూ.50 వేలు అందజేత



ట్రస్ట్ నిర్వాహకునికి నగదు అందిస్తున్న సత్యనారాయణ, విద్యార్థులు

అగనంపూడి: ప్రేరణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విభిన్న ప్రతిభావంతుల పాఠశాలకు అగనంపూడికి చెందిన విజ్ఞాన్ బ్రిలియంట్ పాఠశాల విద్యార్థులు సహకారం అందించారు. పాఠశాల విద్యార్థులు అంతా కలిసి రూ.50వేల నగదును పోగు చేసి ట్రస్ట్ చైర్మన్ రమణకు అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ రమణ మాట్లాడుతూ నలుగురు అంధ విద్యార్థులతో ప్రారంభమైన ట్రస్ట్ నేడు 40 మంది విద్యార్థులకు అండగా నిలిచిందన్నారు. వీరికి పాఠశాల విద్యార్థులు ముందుకు వచ్చి సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. ట్రస్ట్ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ పద్మావతిలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి వినతి



ఏఈకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి సాయి నగర్ కాలనీ, అండమాన్ కొండయ్య వలస ప్రాంతాల్లో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని ఆర్‌ఈసీఎస్ ఏఈ శ్రీనివాస్‌ను స్థానిక నాయకులు కోరారు. ఈ మేరకు ఆయన్ను కలిసి వినతపత్రం అందించారు. గత కొన్నేళ్లుగా సమస్య ఉండడం వల్ల విద్యుత్ ఉపకరణాలు పాడవుతున్నాయన్నారు. ఓల్టేజీలో హెచ్చుతగ్గులపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. ఏఈని కలిసిన వారిలో కత్తి తిలక్ ప్రదీప్‌చంద్ర, చేకూరి నాగరాజు, రమణ రాజు, శనివాడ ప్రసాద్, సాలాపు తాతబాబు, చేకూరి సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో కళాజాత



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు దిబ్బపాలెం నిర్వాసిత కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కళాజాత నిర్వహించారు. బాలల హక్కులు, బాల్య వివాహాల నిషేధం, గుడ్ టచ్..బ్యాడ్ టచ్, అంగన్‌వాడీ కేంద్రాల పాత్రపై కళాకారులు బాల, శ్రీనివాసులు జానపద గేయాలు, వచనాలతో రక్తి కట్టించారు. చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.శ్రీలేఖ, సుజాత, నాయకులు యలమంచిలి అప్పారావు, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది లీల, భారతి, బొబ్రమ్మ, చిన్నిరాజు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న సీఐఎస్ఎఫ్ ఉద్యోగులు

గాజువాక: గాజువాక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక విశాఖ డిఫెన్స్ అకాడమీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 95 మంది రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తమ సంస్థ ప్రతినిధులతో పాటు సీఐఎస్ఎఫ్ ఉద్యోగులు, విద్యార్థులు కూడా స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు స్టీల్ సిటీ రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాసంగి తిరుపతిరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు వై.దాసు, తెంటు సత్యనారాయణ, కొల్లి సత్యంబాబు, చెల్లి రిషికేష్, బండి శ్రీనివాస్, డి.ఎస్.ఎస్.కృష్ణకుమార్, ముమ్మన మురళి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



గాజువాక హైస్కూల్లో మొక్కలు నాటుతున్న నాయకులు, ఉపాధ్యాయులు

గాజువాక: ప్రతి ఒక్కరూ తన తల్లి పేరుతో ఒక మొక్క నాటాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు గాజువాక బీజేపీ నాయకులు మంగళవారం మొక్కలను నాటారు. ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్, పాతకర్ణవానిపాలెం ప్రాథమిక పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ ప్రధాని పిలుపు మేరకు తన తల్లి అప్పలనర్సమ్మ పేరుతో మొక్కలు నాటానని తెలిపారు. ఐదు రోజులపాటు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో గాజువాక జోన్‌లోని 20 వార్డుల్లో మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బాటా శ్రీను, గూటూరు శంకరరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని విజయ ప్రశాంతి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్ర పర్వం.. అప్పన్న నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా బంగారమ్మ పండగ



బంగారమ్మతల్లి

సింహాచలం: అడవివరం గ్రామ దేవత, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి బంగారమ్మతల్లి పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామస్తులు, భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు పుసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కు తీర్చున్నారు. సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. గ్రామ సంప్రదాయం ప్రకారం రాత్రి అమ్మవారి అనుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాత అడవివరంలో ఉన్న బంగారమ్మ శతకంపట్టు నుంచి అమ్మవారి ఆలయం వరకు ఘటాలను పూజారి వంస్తులైన లండ కుటుంబీకులు గ్రామంలో ఊరేగించారు. దారిపొడవునా అమ్మవారికి గ్రామస్తులు స్వాగతం పలికి పసుపుకుంకుమలు సమర్పించారు. ఘటాలను శిరస్సుపై పెట్టుకుని మొక్కు తీర్చుకున్నారు. అనుపులో సింహాచలం దేవస్థానం ఏర్పాటు చేసిన కేరళ డప్పు వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. కాగా నూతన ఆలయం నిర్మిస్తుండటంతో బాలాలయంలోనే భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

దాబాగార్డెన్స్ : ప్రభుత్వం నూతనంగా రూపొందించిన కొత్త చట్టాలపై మానవ హక్కుల పరిరక్షకారులు, పోలీసులు అవగాహన కల్పించుకోవాలని మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాం ప్రసాద్, సోషల్ మీడియా రాష్ట్ర చైర్మన్ సస్ మూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో నూతన చట్టాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతన చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) 2023 చట్టాలు ఈ నెల ఒకటి నుంచి అమలైన సందర్భంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. విశ్రాంత పోలీస్ అధికారి, కౌన్సిల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్వీ రమణ మాట్లాడుతూ కొత్త చట్టాలను అర్థం చేసుకోవడానికి పోలీస్ యంత్రాంగానికి కొంత సమయం పడుతుందన్నారు. న్యాయ శాస్త్రం అభ్యసించే విద్యార్థులు సైతం కొత్త చట్టాల పట్ల అవగాహన కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకురాలు శకుంతల, కౌన్సిల్ ప్రతినిధులు సాగర్, బాబు, సిబ్బంది నారీమణి, నారాయణమ్మ, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీలకు విశేష స్పందన



బొమ్మలు గీస్తున్న కళాశాలల విద్యార్థులు

దాబాగార్డెన్స్ : అల్లూరి జయంత్యుత్సవాలను పురస్కరించుకుని పాఠశాలల పిల్లలు, కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, వ్యాస రచన పోటీలకు విశేష స్పందన లభించింది. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించిన ఈ పోటీల్లో పిల్లలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పోటీలు ఈ నెల 4 వరకు జరుగుతాయని విజ్ఞాన కేంద్రం ప్రతినిధి దండు నాగేశ్వరరావు తెలిపారు. పోటీలకు సంబంధించి మరిన్ని వివరాలకు 9490750661 నంబరులో సంప్రదించాలన్నారు.

ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకోవాలి



దీక్షలో పాల్గొన్న ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కు రాష్ట్ర ప్రజల సొత్తని, వాటిని ప్రైవేటీకరించే విషయంలో ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు రామ్మోహన్ కుమార్, డేవిడ్, కె.శ్రీనివాస్ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే దీక్షల్లో 1237వ రోజు, మంగళవారం వారు పాల్గొని, మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారం కోట్ల మంది తెలుగు ప్రజల ఆత్మాభిమానంతో ముడిపడి ఉందన్నారు. రాష్ట్రానికి వెన్నెముకలాంటి విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం అవుతాయన్నారు. ఉక్కు కర్మాగారాన్ని సరిగ్గా నిర్వహించకుండా, ఇబ్బందులకు గురిచేయడం ద్వారా ప్రైవేటీకరణ చేసేద్దామనే ఆలోచన విరమించుకోవాలన్నారు. దీక్ష శిబిరంలో ఈఎస్ఎఫ్, ఈఆర్ఎస్, ఈఎండీ, సేఫ్టీ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ నాయుడు, డి.ఆదినారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు భూసేకరణ కార్యాలయంలో నోటీసు బోర్డు వివాదం



భూసేకరణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నోటీసు బోర్డు

గాజువాక: విశాఖ ఉక్కు భూసేకరణ కార్యాలయంలో అధికారులు ఏర్పాటు చేసిన నోటీసు బోర్డుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భూసేకరణ కార్యాలయానికి ఏదైనా పని నిమిత్తం వచ్చే వ్యక్తులు స్వయంగా గాని, వారి రక్త సంబంధీకులు గాని అయి ఉండాలని, మధ్యవర్తులకు, దళారులకు ప్రవేశం నిషిద్ధమని ఆ బోర్డులో పేర్కొన్నారు. వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని అందులో హెచ్చరించారు. దీనిపై నిర్వాసిత కాలనీలకు చెందిన పలువురు నాయకులు, సమాచార హక్కు కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలపై అధికారులను కలవడానికి వెళ్తామని, అయినంతమాత్రాన నాయకులను, సమాచార హక్కు కార్యకర్తలను దళారులుగా భావిస్తారా అని వ్యాఖ్యానిస్తున్నారు. భూసేకరణ కార్యాలయంలో కొంతమంది వ్యక్తులు అనధికారికంగా పనిచేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని, వారి వివరాలపై ఆరా తీస్తున్నందుకు సిబ్బంది ఈ విధంగా బోర్డును ఏర్పాటు చేశారని అంటున్నారు. అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగిపై స్థల ఆక్రమణ ఆరోపణ వచ్చిందని, దీనిపై ప్రశ్నిస్తుండటంవల్లే ఇలాంటి చర్యలకు కార్యాలయ అధికారులు ఉపక్రమించారని ఆరోపిస్తున్నారు.

'ఉక్కు' రక్షణకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి



నారాయణకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణకు ఆ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. విశాఖలో నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో పాల్గొనడానికి వచ్చిన నారాయణను కలిసి, ఇక్కడి పరిస్థితిని వివరించారు. ఇక్కడి స్టీల్‌ప్లాంట్ ఎందరో ప్రాణ త్యాగాలతో ఆవిర్భవించిందని, అలాంటి పరిశ్రమను ప్రైవేటీకరించేందుకు పూనుకోవడం సరికాదని వారు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తే వేలాదిమంది రోడ్డున పడతారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలంటూ ప్రస్తుత సమావేశాల్లో తీర్మానం చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎల్లేటి శ్రీనివాసరావు, తాండ్ర కనకరాజు, జి.ఆనంద్, కె.రాజబాబు తదితరులున్నారు.

అతిసారం..ప్రమాదకరం



అతిసారంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి డాక్టర్ హేమలత

పెదగంట్యాడ: వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల్లో అతిసారం ఒకటని, దీనిపై అశ్రద్ధ వహిస్తే ప్రాణాపాయమని గంగవరం యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమలత అన్నారు. స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా గంగవరం యూపీహెచ్‌సీ పరిధిలోని గంగవరం గ్రామంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లల్లో అతిసార రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకూ తల్లి పాలు ఇవ్వాలని సూచించారు. చిన్నారులకు విరేచనాలు అయితే కంగారు పడకుండా వెంటనే వైద్యులకు చూపించాలన్నారు. వారికి ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలని, నిర్దేశించిన మోతాదులో జింక్ మాత్రలు వేయాలని తెలియజేశారు. పిల్లలకు ఆహారం తినిపించే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ జాగ్రత్తలు పాటించడం ద్వారా డయేరియా వ్యాప్తి చెందకుండా కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు నాశనం

ఏసీపీ నరసింహమూర్తి



మాట్లాడుతున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

పెందుర్తి: యువత అనుకున్న లక్ష్యం చేరుకోవాలంటే కచ్చితంగా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి అన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలు పాడు చేసుకుని తల్లిదండ్రులకు క్షోభ మిగిల్చినవారవుతారన్నారు. చినముషిడివాడలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం డ్రగ్స్ వినియోగం–దుష్ఫలితాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. అలాగే ఆన్‌లైన్ బెట్టింగ్‌ల్లో ఎంతో మంది నగదు కోల్పోయి ప్రాణాలు తీసుకునే పరిస్థితి వచ్చిందని చెప్పారు. యువత కష్టపడి పైకి రావాలే తప్పా అడ్డదారుల్లో ముందుకు వెళ్లాలనుకోవడం మంచి పరిణామం కాదన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. పెందుర్తి సీఐ రామకృష్ణ, వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.